www.aakshitha.com

People's voice

# అక్షిత

జాతీయ దినపత్రిక

AKSHITHA NATIONAL DAILY

## తెలంగాణ దిక్సూచి

శుక్రవారం | 31 | జూలై | 2026 | పేజీలు: 08




## అప్రమత్తతతోనే సురక్షితం

రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

2



సిరిసిల్ల నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద రూ.3 కోట్ల 22 లక్షలతో జంక్షన్ అభివృద్ధి సుందరీకరణ , మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణ పనులను మంత్రు లు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే లు త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన ఆర్డీ పాస్‌బుక్‌లు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

## పర్యాటకులు సేదతీరేలా.. ప్రజలకు

# ఆహ్లాదం పంచేలా

చేనేతకు చేయూత

జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్ వ్యవసాయ చేనేత జౌళి శాఖ, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

రగుడు జంక్షన్ అభివృద్ధి పనులను ప్రారంభించిన మంత్రులు

**రాజన్న సిరిసిల్ల, అక్షిత బ్యూరో :** సిరిసిల్ల నేతన్నల సంక్షేమం, వస్త్ర పరిశ్రమ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోందని ఇంచార్జి మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. సిరిసిల్ల మున్సిపల్ పరిధిలోని రగుడు వద్ద రూ.3 కోట్ల 22 లక్షలతో జంక్షన్ అభివృద్ధి సుందరీకరణ , మోడల్ బస్ షెల్టర్ల నిర్మాణ పనులను మంత్రులు తుమ్మల ..మిగతా 2లో



## తక్కువ నీటితో

# ఆరుతడి పంటలు

కూరగాయల సాగు మేలు

వ్యవసాయ క్షేత్రాల్లో రైతులతో ముఖాముఖి

కలెక్టర్ చంద్ర శేఖర్





**నిడమనూరు, అక్షిత న్యూస్ :** ఎల్ నినో కారణంగా జిల్లాలో 40% తక్కువ వర్ష పాతం నమోదైన దృష్ట్యా రైతులు ఈ వ్యవసాయ సీజన్ లో కంది, పెసర,సజ్జలు, జొన్నలు వంటి ఆరుతడి పంటలకు వెళ్లాలని జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ విజ్ఞప్తి చేశారు. ఆరుతడి పంటలకు తక్కువ నీరు అవసరమవుతుందని, దీంతో రైతులకు మేలు కలుగుతుందని,మంచి ఆదాయం వస్తోందని చెప్పారు. అందువల్ల జిల్లాలోని రైతులందరూ ఈ వ్యవసాయ సీజన్లో అరుతడి పంటలు, కూరగాయల పంటల సాగుకు వెళ్లాలని విజ్ఞప్తి చేశారు.

గురువారం ఆయన నిడమనూరు మండలం, బంకాపురం గ్రామంలో కంది పంట సాగు చేసిన రైతుల ..మిగతా 2లో

## నాణ్యమైన విద్య

# అందించడమే లక్ష్యం



విద్యా ప్రమాణాల మెరుగుపర్చేందుకు కృషి

ఎమ్మెల్యే బిఎల్ఆర్

**మిర్యాలగూడ, అక్షిత ప్రతినిధి:** మిర్యాలగూడ మండలం శ్రీనివాస్ నగర్‌లోని ఎంజేపీటీ బీసీ వెల్ఫేర్ రెసిడెన్షియల్ గర్ల్స్ స్కూల్ ను గురువారం మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి బిఎల్ఆర్, మండల విద్యాశాఖ అధికారి డి. ధర్మానాయక్‌తో కలిసి ..మిగతా 2లో

## శాంతి భద్రతల

# పరిరక్షణకు కృషి

పక్కాగా రికార్డుల నిర్వహణ

గంగాధర పోలీసు స్టేషన్ తనిఖీ

పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం

**గంగాధర, అక్షిత న్యూస్ :** కరీంనగర్ కమీషనరేట్ పరిధిలోని గంగాధర పోలీసు స్టేషన్‌ను గురువారం కరీంనగర్ పోలీస్ కమీషనర్ గౌష్ ఆలం తనిఖీ చేశారు. పోలీస్ స్టేషన్ కు విచ్చేసిన కమీషనర్ కు స్టేషన్ ఎస్సై వంశీకృష్ణ పూల మొక్కను అందించి స్వాగతం పలికారు. అనంతరం ..మిగతా 2లో



## అప్రమత్తతతోనే సురక్షితం

### రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద

**అక్షిత బ్యూరో, మంచిర్యాల :** ప్రస్తుతం కురుస్తున్న వర్ష పరిస్థితులలో ప్రజలు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర కార్మిక, ఉపాధి శిక్షణ, కర్మాగార, గనులు భూగర్భ శాఖ మంత్రి గడ్డం వివేకానంద అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో ఇంటి గోడ కూలిన ఘటనలో గాయాలై చికిత్స పొందుతున్న బాధితులను జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ.భాస్కర్, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్ రాథోడ్, ఆర్.ఎం.ఓ. లు భీష్మ, శ్రీధర్, కోటపల్లి మండల తహసిల్దార్ రాఘవేంద్ర లతో కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రి మాట్లాడుతూ ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా కోటపల్లి మండలం ఆలుగాం గ్రామానికి చెందిన ఆత్రం మాంతయ్య ఇంటి గోడ కూలి ఇంటిలో ఉన్న ఆత్రం లక్ష్మి తలకు, ఆత్రం అనిల్ చేతికి గాయాలై మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. బాధితులకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయడం జరిగిందని, పరిహారం చెల్లించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రస్తుత వర్ష పరిస్థితులలో ప్రజా సంక్షేమం దిశగా ప్రభుత్వం అనేక చర్యలు చేపడుతుందని, శిథిలావస్థలో ఉన్న ఇండ్లలోని వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించడంతో పాటు వర్షాల కారణంగా ఏర్పడే పరిస్థితులను ఎదుర్కొనేందుకు అన్ని చర్యలు చేపడుతున్నామని తెలిపారు. చెన్నూర్ నియోజకవర్గ పరిధిలోని చెన్నూర్, క్యాతనపల్లి, చెన్నూర్ మున్సిపల్ కమిషనర్లకు తీసుకోవలసిన చర్యలపై ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. భారీ వర్షాలు కురుస్తున్న ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించి ప్రజా సంరక్షణ చర్యలు చేపట్టడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

**మొదటి పేజీ తరువాయి...**

సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, తరగతి గదులు, మౌలిక వసతులు, విద్యార్థులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రతను ఎమ్మెల్యే క్షుణ్ణంగా పరిశీలించారు.

అనంతరం ఉపాధ్యాయులతో ప్రత్యేక సమావేశం నిర్వహించి టీచర్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. పాఠశాలలో అవసరమైన మౌలిక వసతులు, విద్యా బోధన, సిబ్బంది సమస్యలు, ఇతర అవసరాల గురించి ఉపాధ్యాయులను అడిగి తెలుసుకుని, సంబంధిత అధికారులకు తగిన చర్యలు తీసుకోవాలని సూచించారు. తదుపరి విద్యార్థులతో ముఖాముఖి సమావేశమై వారి విద్యాభ్యాసం, హాస్టల్ వసతులు, ఆహారం, తాగునీరు, పరిశుభ్రత, ఇతర సమస్యల గురించి అడిగి తెలుసుకుని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భరోసా ఇచ్చారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వం రాష్ట్రంలో విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాల్లో విద్యా ప్రమాణాలను మరింత మెరుగుపరిచేందుకు ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షణ చేపడుతోందన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతులు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు.

ఆగస్టు 15 వరకు ప్రతిరోజూ మిర్యాలగూడ నియోజకవర్గంలోని ప్రభుత్వ పాఠశాలలు, గురుకులాలను సందర్శించి అక్కడి పరిస్థితులను స్వయంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకుంటానని వెల్లడించారు.

అనంతరం పాఠశాలలో నిర్వహించిన ఉదయం ప్రార్థన అసెంబ్లీలో విద్యార్థులతో కలిసి పాల్గొని వారికి విద్య ప్రాముఖ్యత, క్రమశిక్షణ, ఉన్నత లక్ష్యాలతో ముందుకు సాగాలని సూచించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం అందజేస్తున్న యూనిఫామ్‌లను విద్యార్థులకు పంపిణీ చేసి, ప్రభుత్వం కల్పిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని ఉన్నత విద్యను అభ్యసించి జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.

కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# పర్యాటకులు సేదతీరేలా.. ప్రజలకు ఆహ్లాదం పంచేలా

**మొదటి పేజీ తరువాయి...**

నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం ప్రారంభించారు. అనంతరం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమానికి మంత్రులు, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేలు త్రిఫ్ట్ ఫండ్ పథకానికి సంబంధించిన ఆర్డీ పాస్‌బుక్‌లు అర్హులైన లబ్ధిదారులకు పంపిణీ చేశారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ సిరిసిల్ల అంటే చేనేతకు ప్రతీక అని, నేతన్నల కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు. గత రెండేళ్లలోనే చేనేత రంగానికి రూ.1,360 కోట్లకు పైగా అందించామని తెలిపారు. నేతన్నలకు ఏడాది పొడవునా పని కల్పించడంతో పాటు భద్రత, భీమా, సంక్షేమ పథకాల అమలుపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని పేర్కొన్నారు.

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చుతోందన్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు సిరిసిల్ల ప్రాంత అభివృద్ధికి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకారం అందిస్తుందని, నేతన్నల సంక్షేమం కోసం మరిన్ని చర్యలు చేపడతామని తెలిపారు.

**నాణ్యమైన చీరల ఉత్పత్తి**

సిరిసిల్లలో నాణ్యమైన ఇందిరా మహిళా శక్తి చీరలు తయారవుతున్నాయని రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి ప్రభాకర్ తెలిపారు. ప్రభుత్వం సిరిసిల్ల నేతన్నలకు పని కల్పిస్తూ



నాణ్యమైన చీరలు మహిళలకు అందిస్తుందని తెలిపారు. సిరిసిల్ల నేతన్నలకు అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. నేతన్న.. గీతన్న వేరు కాదని, జిల్లా నేతగా నేతన్నల అభివృద్ధికి కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు.

ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వస్త్ర పరిశ్రమలో పేరుకుపోయిన బకాయిలను దశలవారీగా విడుదల చేసి నేతన్నల్లో విశ్వాసాన్ని పెంచిందన్నారు.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి 3 కోట్ల మీటర్ల చీరల తయారీకి ఆర్డర్లు అందించామని, ఇప్పటికే దాదాపు కోటి మీటర్ల చీరల ఉత్పత్తి పూర్తైందని తెలిపారు. మరో మూడు కోట్లకు పైగా మీటర్ల చీరల ఉత్పత్తికి కూడా ప్రభుత్వం సిద్ధంగా ఉందని, నేతన్నలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. 62 కోట్ల రూపాయల బిల్లులు చెల్లించామని వెల్లడించారు.

నేతన్నల అభ్యున్నతికి ప్రభుత్వం అనేక కీలక నిర్ణయాలు తీసుకుందని పేర్కొన్న ఆది శ్రీనివాస్, 25 హెచ్‌పీ పవర్‌లూమ్‌లకు రూ.2 విద్యుత్ సబ్సిడీ అమలులోకి తీసుకురావడం ద్వారా పరిశ్రమకు ఊతమిచ్చిందన్నారు. రూ.50 కోట్లతో వేములవాడలో యార్న్ బ్యాంక్ ఏర్పాటు చేశామని తెలిపారు. కామన్ ఫెసిలిటీ సెంటర్ ఏర్పాటు కోసం కూడా ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా నేతన్నల వృత్తి గౌరవాన్ని చాటిచెప్పేలా సిరిసిల్ల కలెక్టరేట్ సర్కిల్ వద్ద రూ.3 కోట్లతో వస్త్రం తయారీ దశల విధానాన్ని ప్రతిబింబించే ప్రత్యేక నిర్మాణాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ పనులు నేతన్న వృత్తి గుర్తుకు వచ్చేలా తీర్చిదిద్దామని తెలిపారు. వారిపై గౌరవం, ప్రేమతో వీటిని ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ.. వేములవాడకు వచ్చే భక్తులు, పర్యాటకులు సేదతీరేలా.. పట్టణ ప్రజలకు ఆహ్లాదం పంచేలా గుడి చెరువు బండ్ పార్క్ పనులను పూర్తి చేసి.. ప్రారంభించామని తెలిపారు. రగుడు బై పాస్ జంక్షన్ సుందరీకరణ పనులు, రోడ్డు విస్తరణ, రోడ్డు భద్రత చర్యలు తీసుకున్నామని, వస్త్రం తయారీలో వివిధ దశలను తెలుసుకునేలా విగ్రహాలను ఏర్పాటు అయ్యాయని తెలిపారు. గత ఏడాది జిల్లాలో ఇందిరా మహిళా శక్తి చీరలు చాలా నాణ్యతతో తయారు చేశారని గుర్తు చేశారు. వాటిని మహిళలు పండగలు, ఇతర కార్యక్రమాలకు కట్టుకుంటున్నారని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వం మరో సారి కూడా ఆర్డర్ ఇచ్చిందని తెలిపారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, మేడిపల్లి సత్యం, ఎస్పీ మహేష్ బి గితే, మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, మున్సిపల్ చైర్ పర్సన్ జిందం కళ, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ స్వరూప తదితరులు పాల్గొన్నారు.

## తక్కువ నీటితో ఆరుతడి పంటలు

**మొదటి పేజీ తరువాయి...**

వ్యవసాయ క్షేత్రాలను పరిశీలించి రైతులతో ముఖాముఖి మాట్లాడారు.

ఈ సందర్భంగా కంది పంట సాగు వివరాలను రైతులతో అడిగి తెలుసుకున్నారు. ఎన్ని ఎకరాల్లో కంది సాగు చేశారని ? పంట వయస్సు ఎంత అని? నల్లరేగడి భూమిలో పంట పరిస్థితి ఎలా ఉందని? ప్రశ్నించారు. దీనికి రైతులు సమాధానమిస్తూ రెండు నెలల క్రితం 15 ఎకరాల్లో కంది సాగు చేశామని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎల్‌నినో ప్రభావం కారణంగా జిల్లాలో సాధారణం వర్షపాతం కంటే 40 శాతం తక్కువగా నమోదైందని, ప్రస్తుతం నాగార్జునసాగర్‌లో డెడ్ స్టోరేజ్ మాత్రమే ఉన్నందున నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని రైతులు తప్పనిసరిగా ఆరుతడి పంటల వైపు మళ్లాలని విజ్ఞప్తి చేశారు.

ఆరుతడి పంటలు 90 రోజుల వ్యవధిలో చేతికి వస్తాయని, తక్కువ నీటితో మంచి ఆదాయం పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఒకవేళ భవిష్యత్తులో నీటి లభ్యత మెరుగుపడితే పరిస్థితులకు అనుగుణంగా ఇతర పంటల సాగును ప్రణాళికాబద్ధంగా చేపట్టాలని సూచించారు.

ప్రభుత్వం వివిధ రకాల పంటలకు కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ఇస్తున్నది, మార్కెట్‌లో డిమాండ్ ఉన్న కంది, పెసర వంటి పంటలను ఎక్కువగా సాగు చేస్తే రైతులకు మంచి ఆదాయం లభిస్తుందని అన్నారు. అలాగే పండ్ల తోటలు, కూరగాయల సాగుపై కూడా రైతులు దృష్టి సారించాలని కోరారు. పంటల్లో కలుపు మొక్కలు పెరిగిన వెంటనే శాస్త్రీయ పద్ధతుల్లో కలుపు నివారణ చర్యలు చేపట్టాలని, వ్యవసాయ అధికారులు అవసరైతే రైతులకు ప్రత్యేక అవగాహన సదస్సులు నిర్వహించి కలుపు నివారణ, పంటల నిర్వహణపై విస్తృత అవగాహన కల్పించాలని ఆదేశించారు.

రైతులతో మాట్లాడిన సందర్భంగా యాప్ వినియోగంపై ఎలాంటి ఇబ్బందులు లేవని రైతులు కలెక్టర్‌కు తెలిపారు.

ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారమే ఆరుతడి పంటలు సాగు చేస్తామని చెప్పారు. ఆరుతడి పంటలకు సంబంధించి జిల్లాలో అందుబాటులో ఉన్న విత్తనాల వివరాలను వ్యవసాయ శాఖ అధికారులు ప్రతిరోజూ సమీక్షించి నివేదిక సమర్పించాలని, రైతులకు అవసరమైన నాణ్యమైన విత్తనాలు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉంచాలని వ్యవసాయ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వ్యవసాయ అధికారి వినోద్ కుమార్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి టి.శేఖర్, ఏడిఏ సరిత, ఏఈఓ మున్నికృష్ణ, తహసిల్దార్ కృష్ణయ్య, ఏఈలు నిషిత, క్రాంతి కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ అంకతి సత్యం, సర్పంచ్ చిన్న వెంకటేశం, వ్యవసాయ అధికారులు, రైతులు కలెక్టర్ వెంట ఉన్నారు.

## శాంతి భద్రతల పరిరక్షణకు కృషి

**మొదటి పేజీ తరువాయి...**

సాయుధ దళ పోలీసుల గార్డ్ అందించిన గౌరవ వందనం స్వీకరించారు. పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. అనంతరం పోలీస్ స్టేషన్ ఆవరణలో పలు కేసుల్లో పట్టుబడి స్వాధీనంలో ఉన్న వాహనాల వివరాలు అడిగారు. పోలీస్ స్టేషన్ లో హాజరులో ఉన్న సిబ్బందితో మాట్లాడి, వారికి కేటాయించబడిన విధుల గురించి అడిగి తెలుసుకున్నారు. సరైన పద్ధతిలో రికార్డుల నిర్వహణ, నమోదైన కేసుల వివరాలు సీసీటీఎన్ఎస్ లో పొందుపరచాలని సూచించారు. తెలంగాణ పోలీసులు టెక్నాలజీ వినియోగంలో భాగంగా ఉపయోగించే సీసీటీఎన్ఎస్ - 2.0, పిటిషన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌లో ఈ-సమన్ల జారీ మరియు అమలు, టీఎస్-కాప్, హెచ్ఆర్ఎంఎస్, ఈ-సాక్ష్య, టెక్ డాటం, ఐరాడ్, దర్పణ్, సీఈఐఆర్, సైబర్ క్రైమ్‌లో ఆర్థిక మరియు ఆర్థికేతర నేరాల సమాచారం, సీడీఆర్ వంటి అన్ని రకాల సాఫ్ట్‌వేర్/అప్లికేషన్‌లపై పూర్తి స్థాయిలో పట్టు సాధించి, వాటిని రోజువారీ విధుల్లో విరివిగా వినియోగించాలన్నారు. పోలీస్ స్టేషన్ కి కేటాయించబడిన పరికరాలను, అలాగే పోర్టబుల్ ఫింగర్ ప్రింట్ డివైస్ ను బ్లూ కోల్ట్స్ సిబ్బంది వినియోగించే తీరును పరిశీలించారు. ఎఫ్ ఐ ఆర్ ఇండెక్స్ ని పరిశీలించి, పెండింగ్ కేసులపై సమీక్ష జరిపారు. కేసుల ఆలస్యానికి గల కారణాలు తెలుసుకుని, త్వరితగతిన ఇన్వెస్టిగేషన్ పూర్తి చేయాలని ఆదేశించారు. గంగాధర పోలీసు స్టేషన్ పరిధిలోని అన్ని గ్రామాలను సెక్టార్లుగా, సబ్ సెక్టార్లుగా విభజించి వాటికి గ్రామ పోలీసు అధికారులను కేటాయించాలని స్పష్టం చేశారు. ప్రతి నెల వారికి సంబంధించిన నూతన సమాచారాన్ని సేకరించి రికార్డుల్లో నమోదు చేసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో రూరల్ ఏసీపీ విజయకుమార్, చొప్పదండి సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రదీప్ కుమార్, గంగాధర ఎస్సై వంశీకృష్ణలతో పాటు ఇతర అధికారులు మరియు సిబ్బంది పాల్గొన్నారు.

# శాస్త్ర విజ్ఞానం, ఆవిష్కరణల రంగాలలో జిల్లాను అగ్రగామిగా నిలపాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్



**ఆసిఫాబాద్, అక్షిత ప్రతినిధి:** విద్యార్థులలో సృజనాత్మకత, పరిశోధనాత్మక ఆలోచనా విధానం, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించి, ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణలో కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లాను రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యువరాజ్ మర్మాట్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన ఇన్స్పైర్ - మానక్ అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనకు కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలలో శాస్త్రీయ ఆలోచనలు, సృజనాత్మకత, పర్యావరణ పరిరక్షణకు సంబంధించిన కార్యక్రమాలను విస్తృతంగా నిర్వహించాలని తెలిపారు. జిల్లాలోని పాఠశాలలు ప్రాధాన్యత ప్రాతిపదికన చేపట్టవలసిన కీలక కార్యక్రమాలపై ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులకు మార్గదర్శకాలు చేశారు. 2026--27 లో కేంద్ర శాస్త్ర సాంకేతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రతిష్టాత్మక ఇన్‌స్పైర్--మానక్ కార్యక్రమంలో 6 నుండి 10వ తరగతి విద్యార్థులు తమ సృజనాత్మక ఆలోచనలు, వినూత్న ఆవిష్కరణలను నమోదు చేయాలని సూచించారు. జిల్లాలోని ప్రతి పాఠశాల తప్పనిసరిగా ఈ కార్యక్రమంలో పాల్గొనాలని, ఒక్కో పాఠశాల నుంచి కనీసం 5 ఉత్తమ ఆవిష్కరణలను నామినేట్ చేయాలని, ఆగస్టు 20, 2026 నాటికి జిల్లాలోని 100 శాతం పాఠశాలల నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని తెలిపారు. జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్--2026 లో భాగంగా ఈ సంవత్సరం "సుస్థిరత కోసం సైన్స్ ఆవిష్కరణలు" అనే ఇతివృత్తంతో 10 నుంచి 17 సంవత్సరాల వయస్సు గల విద్యార్థులు పాల్గొనేలా చూడాలని సూచించారు. స్థానిక సమస్యలకు శాస్త్రీయ పరిష్కారాలను చూపించే ప్రాజెక్టులను విద్యార్థులతో రూపొందించాలని, ప్రతి పాఠశాల నుంచి కనీసం 1, గరిష్టంగా 5 నాణ్యమైన ప్రాజెక్టులను నమోదు చేయాలని తెలిపారు. "ఏక్ పేడ్ మా కే నామ్--2026" లో భాగంగా పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి విద్యార్థి తన తల్లి పేరిట ఒక మొక్కను నాటాలని, ప్రతి పాఠశాలలో ఒక ఉపాధ్యాయుడిని "గ్రీన్ టీచర్"గా నియమించి, మొక్కలు నాటడం, సీడ్ బాల్స్ తయారీ, మొక్కల సంరక్షణ వంటి కార్యక్రమాలను పర్యవేక్షించే బాధ్యత అప్పగించాలని తెలిపారు. ఈకో క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించే ఆన్‌లైన్ పోటీలలో జిల్లాలోని ప్రతి ఉపాధ్యాయుడు, విద్యార్థి 100 శాతం పాల్గొని ఆన్‌లైన్ సర్టిఫికెట్లు పొందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. తరగతి ఉపాధ్యాయులు ఈ ప్రక్రియను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. జిల్లాలోని ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాధికారులు, ఉపాధ్యాయులు ఈ 4 కార్యక్రమాలను అత్యంత ప్రాధాన్యత కలిగిన కార్యక్రమాలుగా భావించి సమర్థవంతంగా అమలు చేయాలని, విద్యార్థులలోని సృజనాత్మకతను వెలికితీసి, శాస్త్రీయ ఆలోచనా విధానాన్ని పెంపొందించడంతో పాటు పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. జిల్లాను శాస్త్ర విజ్ఞానం, ఆవిష్కరణలు, పర్యావరణ పరిరక్షణలో రాష్ట్ర, జాతీయ స్థాయిలో ప్రథమ స్థానంలో నిలపాలని ఆకాంక్షించారు.

ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డు కొనసాగాలంటే ఈ-కేవైసీ తప్పనిసరి.. జూలై 31తో గడువు ముగింపు

### ఈ-కేవైసీ కేంద్రాల వద్ద భారీ రద్దీ

### గడువు పొడిగించాలని డీలర్ల విజ్ఞప్తి



**నిర్మల్ అక్షిత బ్యూరో, జూలై 30:** రేషన్ కార్డుదారులు తమ కార్డులు కొనసాగాలంటే తప్పనిసరిగా ఈ–కేవైసీ (వ–ఖ్జ) పూర్తి చేసుకోవాలని పౌర సరఫరాల శాఖ అధికారులు మరోసారి స్పష్టం చేశారు. ఈ–కేవైసీ ప్రక్రియ పూర్తి చేసేందుకు జూలై 31 చివరి తేదీ కావడంతో జిల్లాలోని రేషన్ దుకాణాలు, ఈ–కేవైసీ కేంద్రాల వద్ద ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివస్తున్నారు.

జిల్లా పౌర సరఫరాల అధికారి రాజేందర్ మాట్లాడుతూ, రేషన్ కార్డులో పేరున్న ప్రతి సభ్యుడు తప్పనిసరిగా ఈ–కేవైసీ చేయించుకోవాలని సూచించారు. గడువు ముగిసేలోపు ఈ ప్రక్రియ పూర్తి చేయని పక్షంలో భవిష్యత్తులో రేషన్ సేవలు పొందడంలో ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు చివరి రోజు వరకు వేచి ఉండకుండా వెంటనే సమీప రేషన్ దుకాణంలో లేదా సంబంధిత కేంద్రంలో ఈ–కేవైసీ పూర్తి చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ఇదిలా ఉండగా, గడువు సమీపించడంతో ఉదయం నుంచే రేషన్ దుకాణాల వద్ద ప్రజలు బారులు తీరుతున్నారు. సాంకేతిక సమస్యలు, అధిక రద్దీ కారణంగా పలుచోట్ల గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తోందని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో రేషన్ డీలర్ శేఖర్ మాట్లాడుతూ, ప్రజలకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ఈ–కేవైసీ గడువును మరికొన్ని రోజులు పొడిగించాలని జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. గడువు పెంచితే మిగిలిన లబ్ధిదారులు కూడా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఈ–కేవైసీ పూర్తి చేసుకునే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.

## ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న సమయంలో చేనులో పూడుకపోయిన కేబుల్ వైరు

# ట్రాక్టర్ నాగలికి తగిలి కేబుల్ స్తంభం రైతు తలపై పడి తీవ్ర గాయాలు

### చికిత్స పొందుతూ రైతు గొల్ల పెద్ద నారాయణ మృతి



**మానవపాడు అక్షిత న్యూస్:** జోగులాంబ గద్వాల జిల్లా మానవపాడు మండలం నారాయణపురం గ్రామంలో దారుణ ప్రమాదం జరిగింది.

తన పొలంలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న సమయంలో గొల్ల పెద్ద నారాయణ (51) అనే రైతు ప్రమాదవశాత్తు మృతి చెందారు.

చేనులో పూడుకుపోయి ఉన్న కేబుల్ వైర్ ట్రాక్టర్ నాగలికి ఊహించని విధంగా తగిలింది. దీంతో కేబుల్ స్తంభం ఒక్కసారిగా విరిగి నారాయణ తలపై పడి తీవ్ర గాయాలయ్యాయి.

పక్కనే ఉన్న తోటి రైతులు, కుటుంబ సభ్యులు వెంటనే ఆయనను కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి నారాయణ చనిపోయినట్లు కుటుంబ సభ్యులు తెలియజేశారు.

## ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం

### చౌటుప్పల్ టి.జి.ఆర్.ఎస్ ప్రిన్సిపల్ టి.విజిత



**చౌటుప్పల్ /అక్షిత న్యూస్:** యాదాద్రి భువనగిరి జిల్లా, చౌటుప్పల్ పట్టణం బంగారుగడ్డ కాలనీలోని తెలంగాణ బాలికల గురుకుల పాఠశాలలో 2026- 27 విద్యా సంవత్సరానికి గాను 6,7,8 తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ టి.విజిత గురువారం పత్రికకు ఇచ్చిన ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ఆసక్తి గల విద్యార్థులు వచ్చేనెల ఆగస్టు 3వ తేదీ సాయంత్రం వరకు దరఖాస్తులను చౌటుప్పల్ పట్టణం బంగారుగడ్డ కాలనీలోని తెలంగాణ గురుకుల పాఠశాల, కళాశాలలో పూర్తి చేసిన దరఖాస్తులను అందజేయాలని కోరారు. విద్యార్థులు దరఖాస్తుతో పాటు వారి ఆధార్ కార్డు, రెండు పాస్ ఫోటోలు, బోనఫైడ్ జిరాక్స్ కాపీలను తప్పనిసరి జత చేయాలని తెలిపారు. దరఖాస్తు చేసిన విద్యార్థులకు ఆగస్టు 5వ తేదీ బుధ వారం ఉదయం 10 గంటలకు సర్వేల్ లోని తెలంగాణ గురు కుల బాలుర పాఠశాలలో ప్రవేశ పరీక్ష నిర్వహించబడుతుందని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు తప్పనిసరి ఇట్టి అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

# సిరిసిల్ల పెద్దబజారులో కూలిన భారీ వేపచెట్టు

### రెండు వాహనాలు ధ్వంసం, వ్యక్తికి గాయాలు





**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** గత మూడు రోజులుగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల ప్రభావంతో గురువారం సిరిసిల్ల పట్టణంలోని పెద్దబజారులో భారీ వేపచెట్టు ఒక్కసారిగా నేలకొరిగింది. అదే సమయంలో అక్కడ నిలిపి ఉంచిన టాటా ఏసి వాహనం, ఓ మినీ వ్యాన్‌పై చెట్టు పడింది. ఈ ఘటనలో మినీ వ్యాన్‌లో ఉన్న ఓ వ్యక్తికి గాయాలయ్యాయి. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే స్పందించి గాయపడిన వ్యక్తిని వాహనం నుంచి బయటకు తీసి, చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చెట్టు కూలిపోవడంతో విద్యుత్ తీగలు కూడా తెగిపడటంతో కొంతసేపు ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. ఘటన సమయంలో అక్కడ పెద్ద సంఖ్యలో ప్రజలు లేకపోవడంతో పెను ప్రమాదం తప్పిందని స్థానికులు ఊపిరిపీల్చుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు, మున్సిపల్ సిబ్బంది వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని, చెట్టును తొలగించే పనులు చేపట్టారు. భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచించారు.



www.aakshitha.com People's voice అక్షిత AKSHITHA NATIONAL DAILY


# నాగర్ కర్నూల్‌లో ఎస్ఐఆర్ డిజిటలైజేషన్‌పై కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

**నియోజకవర్గంలో 99.59 శాతం ఓటర్ల వివరాల నమోదు పూర్తి**

**మిగిలిన ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలి**

**జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్**



**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** అధికారులకు ఆదేశాలు, ఓటరు జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా చేపట్టిన డిజిటలైజేషన్ ప్రక్రియను జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ గురువారం నాగర్ కర్నూల్ పట్టణంలోని 116వ పోలింగ్ కేంద్రాన్ని సందర్శించిన జిల్లా కలెక్టర్, పోలింగ్ కేంద్రంలో జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకొని అధికారులకు పలు సూచనలు చేశారు.

116వ పోలింగ్ కేంద్రంలో విధులు నిర్వహిస్తున్న బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ)తో మాట్లాడిన కలెక్టర్, ఓటర్ల వివరాల డిజిటలైజేషన్ ఎంత మేర పూర్తయిందని అడిగి తెలుసుకున్నారు. 116వ పోలింగ్ కేంద్ర పరిధిలో మొత్తం 1,276 మంది ఓటర్లు ఉండగా, వారిలో 99.25 శాతం మంది వివరాలను ఇప్పటికే డిజిటలైజేషన్ చేసినట్లు బీఎల్ఓ తెలిపారు. మిగిలిన కొద్దిమంది ఓటర్ల వివరాలను కూడా మరో రెండు రోజుల్లో పూర్తిచేస్తామని కలెక్టర్‌కు ఆమె వివరించారు.

అనంతరం నాగర్ కర్నూల్ నియోజకవర్గం మొత్తం డిజిటలైజేషన్ పురోగతిపై ఆర్డీఓ అర్చన తో కలెక్టర్ ఆరా తీశారు. నియోజకవర్గంలోని 270 పోలింగ్ కేంద్రాల పరిధిలో మొత్తం 2,40,571 మంది ఓటర్లు ఉండగా, వారిలో 2,39,563 మంది వివరాల డిజిటలైజేషన్ పూర్తయిందని, దీంతో 99.59 శాతం ప్రక్రియ విజయవంతంగా పూర్తి చేసినట్లు ఆమె తెలిపారు.

ఇంకా మిగిలి ఉన్న 1,008 మంది ఓటర్ల వివరాలను ప్రస్తుతం కొనసాగుతున్న ప్రత్యేక క్షేత్రస్థాయి పరిశీలనలో భాగంగా ధ్రువీకరించి, అనంతరం ఆన్‌లైన్‌లో నమోదు చేయనున్నట్లు ఆర్డీఓ వెల్లడించారు. తాడూరు, నాగర్ కర్నూల్ రూరల్ మండలాల్లో డిజిటలైజేషన్ ప్రక్రియను ఇప్పటికే వంద శాతం పూర్తిచేసినట్లు కూడా కలెక్టర్‌కు వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత కేశవ్ పాటీల్ మాట్లాడుతూ....., ప్రతి అర్హ ఓటరు వివరాలు ఎలాంటి పొరపాట్లు లేకుండా నమోదు కావాలని, డిజిటలైజేషన్ ప్రక్రియను పారదర్శకంగా, నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఓటర్ల వివరాల నమోదు విషయంలో నిర్లక్ష్యానికి తావులేకుండా క్షేత్రస్థాయిలో అధికారులు నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.

జిల్లా కలెక్టర్ వెంట మున్సిపల్ చైర్మన్ తీగల సునేంద్ర, నాగర్ కర్నూల్ ఆర్డీఓ అర్చన నాగర్ కర్నూల్ మున్సిపల్ కమిషనర్ నాగిరెడ్డి, తహసీల్దార్ తబితా రాణి, డీటీ కిరణ్ కుమార్, బూత్ లెవల్ అధికారులు, ఎన్నికల సిబ్బంది తదితరులు ఉన్నారు.

## దుద్దెడలో తృటిలో తప్పిన పెను ప్రమాదం!



**కొండపాక అక్షిత ప్రతినిధి:** కొండపాక మండలం దుద్దెడ గ్రామంలోని రాజీవ్ రహదారి మూల మలుపు వద్ద గురువారం భారీ సిమెంట్ లోడ్‌తో వెళ్తున్న లారీ అదుపుతప్పి బోల్తా పడింది. ఈ సంఘటనలో అదృష్టవశాత్తూ ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదకరమైన మూల మలుపు వద్ద తరచూ ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున, సంబంధిత టోల్‌గేట్ యాజమాన్యం తక్షణమే స్పందించి గ్రామ పరిధిలో భారీ వాహనాల రాకపోకలను నియంత్రించేందుకు అవసరమైన ఎత్తు పరిమితి గేట్లు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు. గతంలో కూడా ఎన్నో ప్రమాదాలు చోటు చేసుకున్నాయని స్థానికులు తెలిపారు. రోడ్డు భద్రత అధికారులు ప్రమాదాల నియంత్రణ కోసం వెంటనే చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరారు.

## ఓటర్ల జాబితా ప్రక్షాళనలో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియ కీలకం

**బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి**





**అక్షిత ప్రతినిధి భూపాలపల్లి:** ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ప్రక్రియ ద్వారా ఓటర్ల జాబితాను పారదర్శకంగా,తప్పులులేని విధంగా రూపొందించే అవకాశం ఉంటుందని బీజేపీ జయశంకర్ భూపాలపల్లి జిల్లా అధ్యక్షుడు ఏడునూతుల నిషీధర్ రెడ్డి అన్నారు.

ఘనపురం మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నిషీధర్ రెడ్డి పాల్గొన్నారు..ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా, అనర్హుల పేర్లు తొలగించేలా ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్.ఐ.ఆర్ ప్రక్రియకు పార్టీ కార్యకర్తలు ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు.ప్రతి బూత్‌లో జరుగుతున్న ప్రక్రియను నిరంతరం పర్యవేక్షిస్తూ ప్రజలకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు.

అనంతరం ఘనపురం తహశీల్దార్‌ను మర్యాదపూర్వకంగా కలిసి మండలంలో కొనసాగుతున్న ప్రక్రియపై వివరాలు తెలుసుకున్నారు.ఘనపురం మండల కేంద్రంలోని 141వ పోలింగ్ బూత్ను సందర్శించి, అక్కడ విధులు నిర్వహిస్తున్న బీఎల్‌వో ఆలూరి కోమలను కలిసి ఓటర్ల నమోదు, దరఖాస్తుల పరిశీలన,అమలు తీరును పరిశీలించారు. ప్రజలకు అందిస్తున్న సేవలపై ఆరా తీశారు.

ఈ కార్యక్రమంలో ఘనపురం మండల ఇన్‌చార్జి శివనాత్రి వేణు, బీజేపీ దళిత మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు దుప్పటి భద్రయ్య, బీజేవైఎం రాష్ట్ర నాయకులు మంద మహేష్,తదితరులు పాల్గొన్నారు.

## రామచిలుకల గూటికి అంతిమయాత్ర..!

**భైంసా పాత పోస్టాఫీస్ సమీపంలోని శతాబ్దాల మర్రిచెట్టు నేలకూలింది పక్షుల నివాసం కోల్పోవడంతో పట్టణవాసుల ఆవేదన**





**నిర్మల్ అక్షిత బ్యూరో, జూలై 30:** భైంసా పట్టణంలోని పాత పోస్టాఫీస్ ఆవరణలో, కుబీర్ చౌరస్తా సమీపంలో ఎన్నో ఏళ్లుగా పట్టణానికి గుర్తింపుగా నిలిచిన భారీ మర్రిచెట్టు బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల ధాటికి నేలకూలింది. ఈ ఘటనతో పట్టణవాసులు తీవ్ర భావోద్వేగానికి గురయ్యారు.

దశాబ్దాలుగా ఆ మర్రిచెట్టు బాటసారులకు, వ్యాపారులకు, ప్రయాణికులకు చల్లని నీడను అందిస్తూ విశ్రాంతి కేంద్రంగా నిలిచింది. వేసవి కాలంలోనూ దాని నీడలో పలువురు సేదతీరేవారు. ముఖ్యంగా ప్రతి రోజు సాయంత్రం వందలాది రామచిలుకలు ఈ చెట్టుపై చేరి రాత్రి బస చేయడం అక్కడి ప్రజలకు నిత్య దృశ్యంగా మారింది. పక్షుల కిలకిలారావాలతో ఆ ప్రాంతం ఆహ్లాదకర వాతావరణాన్ని సంతరించుకునేది. అయితే ఇటీవల కురిసిన వర్షాల ప్రభావంతో భారీ మర్రిచెట్టు ఒక్కసారిగా కూలిపోవడంతో రామచిలుకలు తమ సహజ నివాసాన్ని కోల్పోయాయి. చెట్టు నేలకూలిన దృశ్యాన్ని చూసిన స్థానికులు “రామచిలుకల గూటికి అంతిమయాత్ర జరిగినట్టే” అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

పర్యావరణ ప్రేమికులు, స్థానిక ప్రజలు ఈ ఘటనను బాధాకరంగా అభివర్ణిస్తూ, పట్టణంలో పెద్దఎత్తున మర్రి, రావి వంటి స్థానిక వృక్షాలను నాటేందుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని కోరుతున్నారు. ప్రకృతిని కాపాడితేనే పక్షులు, జీవజాలం, పర్యావరణ సమతుల్యతను రక్షించగలమని వారు పేర్కొన్నారు.

## పాడి పశువుల సంరక్షణపై రైతులకు అవగాహన

**జిల్లా కలెక్టర్ మరియు డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ శ్రీ హేమంత్ కేశవ్ పాటిల్**




**నాగర్ కర్నూల్, అక్షిత ప్రతినిధి:** తెలకపల్లి మండల కేంద్రంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ మరియు డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ శ్రీ హేమంత్ కేశవ్ పాటిల్, ఐఏఎస్ సమక్షంలో, సీడ్స్ డైరీ ఫాం భాగస్వామ్యంతో పాడి పశువుల సంరక్షణ, నాణ్యమైన పాల ఉత్పత్తి మరియు ఎల్‌నినో ప్రభావంతో పశుసంవర్ధక రంగంలో ఎదురయ్యే సమస్యలు, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

పశువులకు సమతుల్య దాణా, పచ్చిమేత, ఎండుమేత, ఖనిజ లవణాలు, పరిశుభ్రమైన తాగునీరు అందించడం ద్వారా ఆరోగ్యంతో పాటు పాల ఉత్పత్తి, పాల నాణ్యతను మెరుగుపరచవచ్చని వివరించారు. ఎల్‌నినో పరిస్థితుల్లో ఏర్పడే పశుగ్రాస, నీటి కొరత మరియు వేడి ఒత్తిడిని ఎదుర్కొనేందుకు సైలేజ్, హే తయారీ, పశుగ్రాస నిల్వ, నీడ--నీటి నిర్వహణ వంటి చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ మరియు డిస్ట్రిక్ట్ మేజిస్ట్రేట్ శ్రీ హేమంత్ కేశవ్ పాటిల్, ఐఏఎస్ పశుసంవర్ధక శాఖ విశ్రాంత డైరెక్టర్ శ్రీ లక్ష్మారెడ్డి శ్రీ ప్రతారెడ్డి , విశ్రాంత డా. అనిల్ ,జిల్లా పశువైద్యాధికారి డా. జ్ఞానశేఖర్ డైరీ ఫార్ సీఈఓ డా. ఇందుకూరి కిషోర్, తెల్కపల్లి డా. డి. మధు, బల్మూర్ డా. డి. అనిల్ పాల్గొన్నారు. అలాగే పారా సిబ్బంది అస్లాం, నూర్జహాన్, సల్మా సుల్తానా, సుల్తాన్ ఓఎస్ డెయిరీ ఫార్మ్ మేనేజర్ మహేందర్ , బీఎం ఇన్‌చార్జ్ ఆంజనేయులు గారు తదితరులు పాల్గొన్నారు.

# జిల్లావ్యాప్తంగా కుండపోత వర్షం..

**ఉప్పొంగుతున్న ప్రాణహిత.. పొంగిపొర్లుతున్న వాగులు, ఒర్రెలు**

**పలు గ్రామాలకు రాకపోకలు నిలిపివేత**

**కుమ్రం భీం, వట్టివాగు ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత**

**లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు...**

**పొంగిపొర్లుతున్న పెద్దవాగు, కొమురం భీం ప్రాజెక్ట్ ను సందర్శించి పలు సూచనలు చేసిన కలెక్టర్ హరిత..**

**కాగజ్ నగర్ డివిజన్ లో వాగుల వద్ద బందోబస్తు పరిశీలించిన ఎస్పీ నికిత పంత్....**



**ఆసిఫాబాద్, అక్షిత బ్యూరో:** ఆసిఫాబాద్ జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో జనజీవనం అస్తవ్యస్తమైంది. వాగులు, ఒర్రెలు ఉప్పొంగి ప్రవహిస్తుండటంతో పలు గ్రామాలకు రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మరోవైపు ఎగువన మహారాష్ట్రలో కురుస్తున్న వర్షాల ప్రభావంతో ప్రాణహిత నదిలో వరద ప్రవాహం పెరుగుతూ తుమ్మిడిహెట్టి వద్ద ఉధృతంగా ప్రవహిస్తోంది. లింగాపూర్ మండలంలో పిట్టగూడ వంతెనపై నుంచి వరద నీరు ప్రవహిస్తుండటంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. ఖిమానాయక్ తాండా, పులసింగ్ నాయక్ తాండా, జాములదారీ, గున్నూర్ తదితర గ్రామాలకు మండల కేంద్రంతో సంబంధాలు తెగిపోయాయి. ప్రమాదకర ప్రాంతాల వద్ద పోలీసు పికెట్లు ఏర్పాటు చేశారు. ప్రజలు వాగులను దాటే యత్నంలో ప్రమాదాలకు గురికాకుండా జిల్లా అధికార యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. జిల్లా కలెక్టర్ హరిత ఎస్పీ నితిక పంత్ లు ఆయా ప్రాంతాలను సందర్శించి వరద ఉధృతిని పరిశీలించడంతో పాటు భద్రత సిబ్బందికి, అధికార యంత్రాంగానికి ప్రజలు ప్రమాదాలకు, ఇబ్బందులకు గురి కాకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తల పై దిశా నిర్దేశం చేశారు. మహారాష్ట్ర, ఛత్తీస్ ఘఢ్ ఎగువ ప్రాంతాల్లో భారీ వర్షాలతో పైన్ గంగ , వైన్ గంగ నదులు ఉధృతంగా ప్రవహిస్తుండటం తో వాటి సంగమ ప్రాంతం తుమ్మిడిహెట్టి వద్ద ప్రాణనది ఉప్పొంగి ప్రవహిస్తోంది. ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు చేరుతుండటంతో జిల్లాలోని ప్రాణహిత పరివాహక ప్రాంతాల్లోని లోతట్టు గ్రామాల ప్రజలను అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. నది ఒడ్డుకు వెళ్లవద్దని, వరదను చూసేందుకు లేదా సెల్ఫీలు తీసేందుకు ప్రయత్నించవద్దని పోలీసులు హెచ్చరిస్తున్నారు. కుమురంభీం ప్రాజెక్టు వద్ద వరద ప్రవాహం పెరగడంతో స్పిల్‌వే ఐదు గేట్లను ఒక్కో మీటర్ మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో గంటకు సుమారు 53,333 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, 10,951 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. వట్టివాగు ప్రాజెక్టు వద్ద కూడా వరద ఉధృతి పెరగడంతో స్పిల్‌వే గేట్లు ఎత్తి నీటిని విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టులో 26,000 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో నమోదవుతుండగా, స్పిల్‌వే గేట్ల ద్వారా 43,333 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు పరిసర ప్రాంతాల్లో భారీ వర్షాలు కొనసాగుతున్న నేపథ్యంలో దిగువ ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు హెచ్చరించారు. జిల్లా యంత్రాంగం ప్రజలు ఎట్టి పరిస్థితుల్లోనూ వాగులు, వంకలు, లో–లెవల్ వంతెనలు దాటే ప్రయత్నం చేయవద్దని, అధికారుల సూచనలు తప్పనిసరిగా పాటించాలని విజ్ఞప్తి

## యువత అవకాశాలను సద్వినియోగం చేసుకుంటూ ఉజ్వల భవిష్యత్తుకై అడుగులు వేయాలి

**టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి**



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో నిర్వహిస్తున్న జాబ్ డ్రైవ్ -- ఇంటర్వ్యూ కార్యక్రమానికి ఐక్యత ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు టాస్క్ సి ఓ ఓ సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నిరుద్యోగ యువతను ఉద్దేశించి మాట్లాడుతూ,నైపుణ్యాలను పెంపొందించు కుని ప్రతి ఉద్యోగ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. యువతకు ఉపాధి కల్పించడం, వారి భవిష్యత్తును తీర్చిదిద్దడం లక్ష్యంగా ఇలాంటి జాబ్ డ్రైవ్‌లు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.

యువతకు ఉద్యోగం కుటుంబానికి భరోసా సమాజానికి అభివృద్ధి” అనే లక్ష్యంతో నిర్వహిస్తున్న ఈ ఇంటర్వ్యూ కు కల్వకుర్తి మండలం నుండి 07 గురు ఆమనగల్ మండలం నుండి 4 గురు,తలకొండపల్లి మండలం నుండి 5గురు ,కడ్తాల్ మండలం నుండి 5 గురు నియోజకవర్గ వ్యాప్తంగా మొత్తం 21 మంది నిరుద్యోగ యువత ఇంటర్వ్యూలకు హాజర య్యారు. ఈ కార్యక్రమంలో కంపెనీ ప్రతినిధులు వీర,శ్రీనివాస్ మరియు ఐక్యత పౌండేషన్ సభ్యులు ఇంటర్వ్యూ కు హాజరైన నిరుద్యోగ యువత పాల్గొన్నారు.

## భారీ వర్షాలు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

**రామన్నపేట ఎస్సై జి. సతీష్**



**రామన్నపేట, అక్షిత ప్రతినిధి:** మండలంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రామన్నపేట సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్సై) జి. సతీష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. వర్షాకాలంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన పలు కీలక సూచనలు చేశారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు, కాలువలు ఉప్పొంగే అవకాశం ఉన్నందున ఎట్టి పరిస్థితుల్లోనూ వాటిని దాటేందుకు ప్రయత్నించవద్దని సూచించారు. నీటి ప్రవాహం ఎక్కువగా ఉన్న ప్రాంతాలకు వెళ్లకుండా అప్రమత్తంగా ఉండాలని, పిల్లలను ఒంటరిగా బయటకు పంపవద్దని తెలిపారు. విద్యుత్ స్తంభాలు, తెగిపోయిన విద్యుత్ తీగలు, ట్రాన్స్‌ఫార్మర్లకు దూరంగా ఉండాలని, నీటితో నిండిన రహదారులపై వాహనాలు నడిపేటప్పుడు అత్యంత జాగ్రత్త వహించాలని ఎస్సై సూచించారు. వాతావరణ శాఖ హెచ్చరికలను ఎప్పటికప్పుడు గమనిస్తూ పోలీసు, రెవెన్యూ అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. వృద్ధులు, గర్భిణీలు, చిన్నారుల విషయంలో కుటుంబ సభ్యులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని పేర్కొన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే పోలీసు -- 100, అగ్నిమాపక శాఖ -- 101, అంబులెన్స్ -- 108, విపత్తు నిర్వహణ -- 1077 నంబర్లకు సమాచారం అందించాలని సూచించారు. ప్రజల ప్రాణాలు, ఆస్తుల రక్షణే పోలీసు శాఖ ప్రధాన లక్ష్యమని, భారీ వర్షాల సమయంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా వెంటనే రామన్నపేట పోలీసులను సంప్రదించాలని ఎస్సై జి. సతీష్ కోరారు. ప్రజల సహకారంతోనే ప్రమాదాలను నివారించగలమని, ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉంటూ సురక్షితంగా ఉండాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# పాఠశాలే ప్రాణంగా.. విద్యార్థులే ప్రపంచంగా

**ఓ ప్రభుత్వ ఉపాధ్యాయుడి 34 ఏండ్ల ఉద్యోగ స్ఫూర్తి ప్రస్థానం**

**పాఠశాలనే కుటుంబంగా భావించి సేవలందించిన ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ చకినాల శ్రీనివాస్ ఈ నెల జులై 31న ఉద్యోగ విరమణ సందర్భంగా ప్రత్యేక కథనం**



**రాజన్న సిరిసిల్ల, అక్షిత:** ప్రభుత్వ పాఠశాలలు కూడా కార్పొరేట్ విద్యాసంస్థలకు ఏమాత్రం తీసిపోవని తన సేవలతో నిరూపించిన ప్రధానోపాధ్యాయుడు డాక్టర్ చకినాల శ్రీనివాస్ ఈ నెల 31న పదవీ విరమణ పొందనున్నారు. మూడున్నర దశాబ్దాలకు పైగా ఉపాధ్యాయుడిగా, ప్రధానోపాధ్యాయుడిగా వేలాది మంది విద్యార్థుల జీవితాలకు దిశానిర్దేశం చేసిన ఆయన ప్రస్థానం స్ఫూర్తిదాయకంగా నిలిచింది. ఒక పాఠశాల అభివృద్ధి అంటే కేవలం భవనాలు కాదు... విద్యార్థుల భవిష్యత్తు, సమాజ విశ్వాసం, ఉపాధ్యాయుల అంకితభావం కలిసి నిర్మించే ఉద్యమమని ఆయన కార్యాచరణ చాటిచెప్పింది.

1965 జూలై 30న రాజన్న సిరిసిల్ల జిల్లా దుమాలలో హనుమయ్య, నర్సమ్మ దంపతులకు జన్మించిన శ్రీనివాస్ ప్రాథమిక విద్యను స్వగ్రామంలో, ఉన్నత విద్యను సిరిసిల్ల, హైదరాబాద్‌లలో పూర్తి చేశారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీతో పాటు ఎంఎస్సీ (గణితం), ఎంఎస్సీ (భూగోళశాస్త్రం), ఎంకాం, ఎంఎడ్ వంటి ఉన్నత విద్యార్హతలు సాధించి విద్యారంగంలో అరుదైన గుర్తింపు పొందారు.

1992 నవంబర్ 17న ఆదిలాబాద్ జిల్లా బోథ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గణిత శాస్త్ర ఉపాధ్యాయుడిగా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించిన ఆయన, సిరిసిల్ల, కరీంనగర్ తదితర ప్రాంతాల్లో సేవలందించి 2018లో ప్రభుత్వ ఉన్నత పాఠశాల, సిరిసిల్ల ప్రధానోపాధ్యాయుడిగా బాధ్యతలు చేపట్టారు.

86 నుంచి 322 మంది విద్యార్థుల వరకు 2018 జూలై 7న ఆయన సిరిసిల్ల ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుడుగా బాధ్యతలు చేపట్టే సమయానికి పాఠశాలలో కేవలం 86 మంది విద్యార్థులు మాత్రమే ఉండగా, తరగతులకు హాజరైన వారు 31 మందే. అయితే ఇంటింటి ప్రచారం, బడిబాట, తల్లిదండ్రులతో సమావేశాలు, స్వయం సహాయక సంఘాలతో చర్చలు, నాణ్యమైన బోధన, సౌకర్యాల కల్పన వంటి వినూత్న కార్యక్రమాల ద్వారా పాఠశాలపై ప్రజల్లో విశ్వాసం పెంచి విద్యార్థుల సంఖ్యను 322కు చేర్చడం విశేషం.

### పురస్కారాలు

2022లో రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం, తెలంగాణ రాష్ట్ర ఆహార కమిషన్ వ్యాసరచన పోటీలో రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి, 2025లో జిల్లా కలెక్టర్ ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా సత్కరించారు.

విద్యారంగంతో పాటు జలసాధన వేదిక, తెలంగాణ విద్యావంతుల వేదిక, సాగునీటి ఉద్యమం, ఉపాధ్యాయ సంఘాలు, సామాజిక సేవా కార్యక్రమాల్లోనూ చురుకైన పాత్ర పోషిస్తూ సమాజానికి తనవంతు సేవ అందించారు.

పదవీ విరమణ అనేది ఉద్యోగానికి మాత్రమేనని, సేవకు కాదని తన జీవితంతో నిరూపించిన డాక్టర్ చకినాల శ్రీనివాస్... విద్యార్థుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయే గురువు, ఆదర్శ ప్రధానోపాధ్యాయుడిగా గుర్తుండిపోతారు.

# తీగలగుట్టపల్లి ఆర్వోబీ పనులపై మేయర్, కమిషనర్ ఆకస్మిక తనిఖీ



### కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి నిర్ణయం

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ నగరంలోని తీగలగుట్టపల్లి రైల్వే ఓవర్ బ్రిడ్జి (ఆర్వోబీ) నిర్మాణ పనుల్లో నెలకొన్న జాప్యం, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నేపథ్యంలో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ గురువారం ఆకస్మికంగా నిర్మాణ ప్రాంతాన్ని సందర్శించి పరిస్థితిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇటీవల ఆర్వోబీ సమీపంలోని కల్వర్టులో ఓ వృద్ధురాలు పడిపోయిన ఘటనపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ సంబంధిత ఆర్‌డబీ అధికారులు, కాంట్రాక్టర్లతో మాట్లాడి ప్రజలకు ఇబ్బందులు లేకుండా తక్షణ ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అనంతరం న్యూఢిల్లీ నుంచి మేయర్ కొలగాని శ్రీనివాస్‌తో ఫోన్‌లో మాట్లాడి, మున్సిపల్ కార్పొరేషన్ తరఫున అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు. దీంతో మేయర్ వెంటనే సంఘటన స్థలాన్ని పరిశీలించి తాత్కాలిక పరిష్కారంగా బారికేడ్లు ఏర్పాటు చేసి ప్రమాదాలు జరగకుండా చర్యలు చేపట్టారు. అనంతరం మేయర్ కొలగాని శ్రీనివాస్, కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఏసీపీ విజయ్ కుమార్ ఆర్వోబీ నిర్మాణ ప్రాంతానికి చేరుకుని బీటీ రోడ్డు, కల్వర్టు పరిస్థితిని పరిశీలించారు. ప్రజలు ఎదుర్కొంటున్న రాకపోకల ఇబ్బందులను ప్రత్యక్షంగా గమనించిన మేయర్, రాష్ట్ర ప్రభుత్వం నుంచి నిధులు అందుబాటులో లేకపోయినా కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని నిర్ణయించారు. సంబంధిత అధికారులకు వెంటనే పనులు ప్రారంభించాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆర్‌డబీ అధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులు మాట్లాడుతూ ఆర్వోబీ నిర్మాణంలో ప్రధాన అడ్డంకి భూసేకరణ జాప్యమేనని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో భూసేకరణ పూర్తికాకపోవడంతో పనులు ఆలస్యమయ్యాయని, ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను వేగవంతం చేస్తూ త్వరలో నోటిఫికేషన్ జారీ చేయనున్నట్లు తెలిపారు. అలాగే ఆర్వోబీ నిర్మాణ సమయంలో ప్రజల రాకపోకలకు ప్రత్యామ్నాయంగా చేపట్టాల్సిన బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఆ పనులు నిలిచిపోయినట్లు అధికారులు వెల్లడించారు. ఇదే సమయంలో కేంద్ర ప్రభుత్వ సేతు బంధన్ పథకం కింద ఆర్వోబీ నిర్మాణానికి అవసరమైన నిధులు పూర్తిగా విడుదల చేసినప్పటికీ పనులు ఎందుకు ఆలస్యం అవుతున్నాయని కేంద్ర



మంత్రి బండి సంజయ్ కాంట్రాక్టర్‌ను ప్రశ్నించారు. దీనికి స్పందించిన నిర్మాణ సంస్థ ప్రతినిధులు భూసేకరణ ప్రక్రియ పూర్తికాగానే పనులు వేగవంతం చేస్తామని, వచ్చే ఆరు నెలల్లో ఒక వైపు ఆర్వోబీ నిర్మాణాన్ని పూర్తి చేసి, ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాదిలోపు మొత్తం ఆర్వోబీ నిర్మాణాన్ని పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. అలాగే నగరంలోని పలు డివిజన్లలో వర్షాల ప్రభావానికి గురైన ప్రాంతాలను కూడా మేయర్ పరిశీలించి, అవసరమైన సహాయక చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, ప్రభుత్వాల మధ్య నిధుల అంశం ఎలా ఉన్నప్పటికీ నగర ప్రజలు ఇబ్బందులు పడకుండా మున్సిపల్ కార్పొరేషన్ తరఫున అవసరమైన బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులను అత్యవసరంగా చేపడతామని స్పష్టం చేశారు. పనుల పురోగతిపై నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ తనిఖీలో మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఐఏఎస్, ఏసీపీ విజయ్ కుమార్, సీఐ నిరంజన్ రెడ్డి, ఎస్సై లక్ష్మారెడ్డి, ఆర్‌డబీ అధికారులు, మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి డిఎన్ఆర్ ఆర్థిక చేయూత



**కల్వకుర్తి అక్షిత ప్రతినిధి:** ఊర్కొండ మండలంలోని రేవల్లి గ్రామానికి చెందిన తప్పెట నీలమ్మ(80) అనారోగ్యంతో మరణించారు. విషయం తెలుసుకున్న మాధారం మాజీ సర్పంచ్,కాంగ్రెస్ పార్టీ నాయకులు ద్యాప నిఖిల్ రెడ్డి మృతురాలి కుటుంబానికి కాంగ్రెస్ పార్టీ నాయకుల ద్వారా రూ.5000/- వేల రూపాయలు అందజేశారు. ఈ కార్యక్రమంలో రేవల్లి గ్రామ సర్పంచ్ రొడ్డ బంగారు మరియు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అయ్యూబ్ పాష మరియు పిఏసిఎస్ డైరెక్టర్ ఫరీద్ మరియు వార్డు సభ్యులు కర్రోళ్ల వెంకటయ్య,కాటమోని వెంకటయ్య,ఎర్రోళ్ల జంగయ్య, పోలె శంకర్ మరియు ఇందిరమ్మ కమిటీ సభ్యులు ఖలీల్ ఖాన్,జంగి రెడ్డి,కర్రోల్ల పరశురాములు,రమేష్ మరియు కాంగ్రెస్ నాయకులు మహ్మద్ ఖాజ,గొల్ల నీలయ్య,కృష్ణయ్య, మాల ఈశ్వరయ్య,కేశవులు, బంగారు,తప్పెట నీలయ్య, లింగమయ్య,ఆంజనేయులు, రాములు,నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## డ్రైన్ పనులను పరిశిలిస్తున్న 63వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ విజయ శ్రీ సయ్యద్ రజాలి



**కాజిపేట్, అక్షిత ప్రతినిధి :** హనుమకొండ జిల్లా వరంగల్ పశ్చిమ నియోజకవర్గం 63వ డివిజన్లో మెయిన్ రోడ్ సెంట్ జోసఫ్ చర్చ్ ముందు డ్రైన్ పనులను 63వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ విజయ శ్రీ సయ్యద్ రజాలి గురువారం రోజున పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జాతీయ రహదారిపై చాలా ఇబ్బందికరంగా కల్వర్టు నీళ్లు రోడ్డుపై నుంచి ప్రవహిస్తున్నాయని దీనివల్ల వాహనదారులకు, పాదాచారులకు ఇబ్బందికరంగా ఉన్న విషయాన్ని గమనించి ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దృష్టికి తీసుకువెళ్లగా అప్పటికి అప్పుడు వింగ్ ఆఫీసర్లతో మాట్లాడి పనులను ప్రారంభించడానికి సహకరించరు అనీ తెలిపారు. ఇందుకు సహకరించిన ఎమ్మెల్యే నాయినికి తాజా మాజీ కార్పొరేటర్ ప్రజల తరపున కృతజ్ఞతలు తెలియజేశారు

## ప్రీ-ప్రైమరీ టీచరుగా అనూష ఎంపిక



**నడిగూడెం, అక్షిత న్యూస్:** మండలం లోని సిరిపురం ప్రాథమిక పాఠశాల-2లో నూతనంగా మంజూరైన ప్రీ ప్రైమరీ స్కూలు టీచరు పోస్టుకు ఎంపికైన మొక్కా అనూష కు గురువారం మండల విద్యాధికారి వనం.సత్యనారాయణ నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్యాభివృద్ధికి ప్రభుత్వపరంగా కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇట్టి కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బుర్రి.శ్రీనివాసరావు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, తదితరులు పాల్గొన్నారు.

### భారీ వర్షాల నేపథ్యంలో కడెం ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను

# సమీక్షించిన జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్



**నిర్మల్, అక్షిత ప్రతినిధి :** జిల్లాలో మొన్న రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల, ఐపీఎస్ గురువారం కడెం ప్రాజెక్టును సందర్శించి వరద పరిస్థితులను పరిశీలించారు. ప్రాజెక్టు నీటి మట్టం, ప్రవాహ పరిస్థితులు, లోతట్టు ప్రాంతాల పరిస్థితి, ప్రజల రాకపోకలు, భద్రతా ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో కలిసి సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు.

ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, రాబోయే రెండు రోజుల పాటు కూడా భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున జిల్లా ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అత్యవసర పరిస్థితులు ఎదురైతే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ప్రజల ప్రాణ, ఆస్తి రక్షణకు జిల్లా పోలీసు శాఖ అన్ని విధాలుగా సిద్ధంగా ఉందని తెలిపారు.

అలాగే కడెం ప్రాజెక్టు, ఇతర వాగులు, వంకలు, చెరువులు, నీటి ప్రవాహ ప్రాంతాల వద్దకు ఎవరూ వెళ్లరాదని, సెల్ఫీలు లేదా వీడియోలు తీసేందుకు ప్రయత్నించవద్దని హెచ్చరించారు. గొర్రెలు, పశువుల కాపరులు, మత్స్యకారులు నీటి ప్రవాహ ప్రాంతాలకు వెళ్లకుండా ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, కాలువలను దాటేందుకు ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రయత్నించవద్దని స్పష్టం చేశారు.

గ్రామాలు, పట్టణాల్లో పాత ఇళ్లు, గుడిసెలు, శిథిలావస్థలో ఉన్న భవనాల్లో నివసిస్తున్న వారు మరింత అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ బ్లూ కోల్ట్స్, పెట్రో కార్ల సిబ్బంది నిరంతరం గస్తీ నిర్వహించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ఎలాంటి ఆపత్కాల పరిస్థితులు ఏర్పడినా వెంటనే స్పందించి ప్రాణనష్టం జరగకుండా అన్ని చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ బి. వెంకటేశ్వర్లు, ఐఏఎస్, డీఆర్‌డీఓ పీడీ విజయలక్ష్మి, ఖానాపూర్ మున్సిపల్ కమిషనర్ సుందర్ సింగ్, కడెం మండల తహసీల్దార్, ఎంపీడీవో, విద్యుత్ శాఖ ఏఈ, కడెం ప్రాజెక్టు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ప్రవీణ్ కుమార్, నిర్మల్ డీఎస్పీ శ్రీనివాస్, ఖానాపూర్ సీఐ సత్యనారాయణ, సంబంధిత శాఖల అధికారులు మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలి



## మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్


## వేములవాడ శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో మంత్రుల పూజలు

## స్వాగతం పలికిన ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే

**రాజన్న సిరిసిల్ల అక్షిత బ్యూరో:** సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురువాలని జిల్లా ఇంచార్జి మంత్రి, మార్కెటింగ్, వ్యవసాయ, చేనేత జౌళి, సహకార శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, ఎస్సీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ఆకాంక్షించారు.

జిల్లా పర్యటనలో భాగంగా వేములవాడ కు చేరుకున్న మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ కు ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్, ఎస్పీ మహేష్ బి గితే పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు.

మంత్రులకు శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలోకి అర్చకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ ప్రభుత్వ



విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఎమ్మెల్యేలు కవ్వంపల్లి సత్యనారాయణ, సంజయ్ స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అర్చకులు వారికి ఆశీర్వచనం చేసి.. స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఈ సందర్భంగా శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీ స్వామివారికి మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం ఏకాంతంగా నిర్వహించారు. అలాగే శ్రీ భీమేశ్వర స్వామి ఆలయంలో జూలై 30వ తేదీ నుండి ఆగస్టు 1వ తేదీ వరకు సత్వర సద్యఃసువృష్టి (సకాల వర్షప్రాప్తి) కోసం ఋశ్యశృంగ ప్రతిష్ఠ, వరుణయాగం, వరుణ పర్జన్య జపానుష్ఠానాలు, హవనాలు, శ్రీ భీమేశ్వర స్వామివారికి సంతత ధారాభిషేకం నిర్వహించనున్నారు.

అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు యాగశాలలో వరుణయాగాన్ని అధికారికంగా ప్రారంభించారు. భీమేశ్వర సదన్‌లోని ఈశాన్య మూలలో వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతకు ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రారంభించారు. అనంతరం భీమేశ్వర సదన్‌లో ఏర్పాటు చేసిన వసతి గృహాలను సందర్శించారు. ఈ సందర్భంగా గౌరవ ప్రభుత్వ విప్ మరియు వేములవాడ ఎమ్మెల్యే శ్రీ ఆది శ్రీనివాస్ గారు శాలువాలతో గౌరవ మంత్రులను సత్కరించి ఆహ్వానించారు.

ఈ సందర్భంగా గౌరవ మంత్రులు, ఎమ్మెల్యేలు మాట్లాడుతూ, వరుణయాగం అనేది కేవలం ఆధ్యాత్మిక క్రతువే కాకుండా లోకకళ్యాణాన్ని ఆకాంక్షిస్తూ నిర్వహించే మహోన్నత వైదిక సంప్రదాయమని పేర్కొన్నారు. సకాలంలో సమృద్ధిగా వర్షాలు కురవడం ద్వారా చెరువులు, కుంటలు, జలాశయాలు నిండిపోతాయని, భూగర్భ జలాలు పెరుగుతాయని, రైతులకు సాగునీరు సమృద్ధిగా లభించి పంటలు బాగా పండుతాయని తెలిపారు.

సమృద్ధిగా వర్షాలు కురిస్తే రైతులు ఆర్థికంగా బలోపేతం అవడంతో పాటు రాష్ట్రం వ్యవసాయరంగంలో మరింత అభివృద్ధి సాధిస్తుందని, ప్రజలకు తాగునీటి సమస్యలు తీరడంతో పాటు పర్యావరణ సమతుల్యత కూడా నెలకొంటుందని అన్నారు. రాష్ట్ర ప్రజలందరూ సుఖసంతోషాలతో జీవించాలని, తెలంగాణ సస్యశ్యామలంగా వెలుగొందాలని ఆకాంక్షిస్తూ ఈ వరుణయాగాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

కార్యక్రమంలో దేవస్థానం కార్య నిర్వహణాధికారి శ్రీమతి రమాదేవి, అదనపు ఎస్పీ చంద్రయ్య, ఆర్డీఓ కే ఎస్ బీ కుమారి, మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మున్సిపల్ కమిషనర్ లోకేష్, తహసీల్దార్ జయంత్ తదితరులు పాల్గొన్నారు.

# తీగలగుట్టపల్లి ఆర్వోబీ జాప్యంపై బండి సంజయ్ అసంతృప్తి

## మేయర్,డిప్యూటీ మేయర్‌తో ఫోన్లో మాట్లాడిన మంత్రి

## ప్రత్యామ్నాయ పనులకు ఆదేశాలు

**కరీంనగర్ అక్షిత బ్యూరో:** కరీంనగర్ నుండి మంచిర్యాల వెళ్లే దారిలో సుభాస్ నగర్ కు దగ్గరలో రోడ్ ఓవర్ బ్రిడ్జి రైల్వే స్టేషన్ రోడ్ లో గల తీగలగుట్టపల్లి ఆర్వోబీ నిర్మాణంలో జాప్యం,ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అసంతృప్తి వ్యక్తం చేశారు.ఆర్వోబీ సమీపంలోని కల్వర్టులో ఓ వృద్ధురాలు పడిపోయిన ఘటనపై స్పందించిన ఆయన, ఆర్అండ్‌బీ అధికారులు, కాంట్రాక్టర్‌ను ప్రశ్నిస్తూ ప్రజలకు ఇబ్బంది లేకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదని నిలదీశారు.అధికారులు స్పందిస్తూ,గత ప్రభుత్వ హయాంలో భూసేకరణ ఆలస్యం కావడంతో పనులు జాప్యం అయ్యాయని,





ప్రస్తుతం భూసేకరణ ప్రక్రియ కొనసాగుతోందని, త్వరలో నోటిఫికేషన్ విడుదల చేస్తామని తెలిపారు.రాష్ట్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో బీటీ రోడ్డు, కల్వర్టు పనులు నిలిచిపోయాయని వివరించారు.దీనిపై ఢిల్లీ నుంచి మేయర్ కొలగాని శ్రీనివాస్,డిప్యూటీ మేయర్ సునీల్ రావుతో మాట్లాడిన బండి సంజయ్,మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలోనే ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని సూచించారు. దీంతో మేయర్,మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్ హుటాహుటిన ఆర్వోబీ వద్దకు చేరుకుని పరిస్థితిని పరిశీలించారు.యుద్ధ ప్రాతిపదికన బీటీ రోడ్డు, కల్వర్టు నిర్మాణ పనులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.సేతు బంధన్ పథకం కింద కేంద్రం పూర్తి నిధులు అందిస్తున్నప్పటికీ భూసేకరణ ఆలస్యమే జాప్యానికి కారణమని కాంట్రాక్టర్ తెలిపారు.మరో ఆరు నెలల్లో ఒకవైపు ఆర్వోబీ పనులు పూర్తి చేసి,ఒప్పందం ప్రకారం వచ్చే ఏడాదిలోగా మొత్తం నిర్మాణాన్ని పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు.

# పొన్నం గారూ... కొండగట్టు గిరిప్రదక్షిణ కాదు... కొండగట్టు అభివృద్ధికి దిశ చూపండి!

## జనసేన కరీంనగర్ నాయకులు డా. బండారి రాజ్‌కుమార్



**మల్యాల అక్షిత ప్రతినిధి:** జనసేన కరీంనగర్ నాయకులు డా. బండారి రాజ్‌కుమార్ గురువారం శ్రీ కొండగట్టు ఆంజనేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, ఐశ్వర్యాలతో వర్ధిల్లాలని ప్రార్థించారు. అలాగే పవన్ కళ్యాణ్ ప్రజాసేవలో మరింత విజయవంతంగా ముందుకు సాగాలని, కొండగట్టు ఆంజనేయ స్వామివారి ఆశీస్సులు ఎల్లప్పుడూ ఆయనకు ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం మీడియాతో డా. బండారి రాజ్‌కుమార్ మాట్లాడుతూ, "నిన్న పొన్నం ప్రభాకర్ కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామివారిని దర్శించుకోవడం స్వాగతించదగిన విషయమే. అయితే లక్షలాది మంది భక్తులు ఆశించింది గిరిప్రదక్షిణ వార్తలు కాదు... కొండగట్టు అభివృద్ధికి స్పష్టమైన దిశానిర్దేశం. పార్కింగ్, భక్తుల కాటేజీలు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు, రహదారులు, పరిశుభ్రత, భక్తుల వసతులు వంటి ప్రధాన సమస్యల పరిష్కారంపై స్పష్టమైన కార్యాచరణను ప్రకటిస్తారని అందరూ ఎదురుచూశారు. కానీ ఆ అంశాలపై చర్చ జరగకపోవడం కొండగట్టు ఆంజనేయ స్వామి భక్తులను, ఆలయ అర్చకులను, స్థానిక ప్రజలను తీవ్ర నిరాశకు గురి చేసింది."అని అన్నారు.తెలంగాణ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా పవన్ కళ్యాణ్ గారిని 'పెయిడ్ ఆర్టిస్ట్' అని సంబోధించడం రాజకీయ హుందాతనానికి తగినది కాదు. వ్యక్తిగత విమర్శలతో రాజకీయాలు చేయడం సులభం. కానీ కొండగట్టు వంటి మహా పుణ్యక్షేత్రాన్ని దేశంలోనే ఆదర్శ ఆధ్యాత్మిక--పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దే విజన్ చూపించడం నిజమైన నాయకత్వం. పెయిడ్ ఆర్టిస్ట్ గురించి కాదు.డెవలప్ కొండగట్టు గురించి మాట్లాడండి. విమర్శలు కాదు... కొండగట్టుకు విజన్ చెప్పండి. ప్రజలు రాజకీయ వ్యాఖ్యలను కాదు... అభివృద్ధి ఫలితాలను గుర్తుంచుకుంటారు." అని స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జనసేన మహిళా నాయకురాలు డా. సాయి కృష్ణ ప్రియ, జనసేన నాయకురాలు రాజిత, చొప్పదండి జనసేన నాయకులు మొగిలిపాక రమేష్, శ్రీనాథ్‌తో పాటు పలువురు జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# దత్తారం గ్రామంలో సమస్యల పరిష్కారానికి గ్రామసభ

## గ్రామ సర్పంచ్ మస్తాన్



**నాగర్ కర్నూల్ అక్షిత ప్రతినిధి:** లింగాల మండలంలోని దత్తారం గ్రామపంచాయతీలో నిర్వహించిన ప్రత్యేక గ్రామసభలో సర్పంచ్ మస్తాన్ మరియు గ్రామపంచాయతీ సెక్రెటరీ ఆర్డబ్ల్యూఎస్ ఏ ఈ పాల్గొని రైతులను ఉద్దేశించి పలు ముఖ్య అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జలసిరి కార్యక్రమంఎల్‌నినో వాతావరణ పరిస్థితులు మరియు వాటి ప్రభావం వ్యవసాయంపై ఎలా ఉంటుందనే విషయాలను వివరించారు. వర్షపాతం అనిశ్చితంగా ఉండే పరిస్థితుల్లో రైతులు నీటి లభ్యతను దృష్టిలో ఉంచుకుని పంటల ప్రణాళిక రూపొందించుకోవాలని సూచించారు. అలాగే, తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలు అయిన కంది, పెసర, మినుము, నువ్వులు, ఆముదం తదితర పంటలను సాగు చేయడం ద్వారా నష్టాలను తగ్గించుకోవచ్చని రైతులకు సూచించారు. అదేవిధంగా, గ్రామస్థాయిలో ఏర్పాటు చేసిన నిగ్రాణి సమితి యొక్క పాత్ర, విధులు గురించి వివరించారు. ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజల భాగస్వామ్యంతో పారదర్శకంగా కార్యక్రమాలు నిర్వహించడం, సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లడం వంటి అంశాల్లో నిగ్రాణి సమితి కీలక పాత్ర పోషిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెంకటయ్య. వార్డు సభ్యులు రాములు. తోపాటు గ్రామస్థాయి అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు కోసం వినూత్న నిరసన



**కరీంనగర్ అక్షిత బ్యూరో:** రాష్ట్రవ్యాప్తంగా నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు రోడ్లన్నీ గుంతల మయంగా మారాయి,కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ హాస్పిటల్ ముందు రోడ్డు మర మత్తులు చేయాలని సామాజిక కార్యకర్తల ఆధ్వర్యంలో గురువా రం నిరసన కార్యక్రమం చేపట్టారు. గత కొన్నిసంవత్సరాలుగా ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లే రోడ్డు చాలా అద్వానంగా ఉందని హార్ట్ పేషంట్స్ లేదా డెలివరీ పేషెంట్ గాని ఈ రోడ్డు పై వెలితే చనిపోయే అవకాశం ఉందని ఆయన పేర్కొన్నారు.కార్యక్రమంలో సామాజిక కార్యకర్త లు కోట శ్యామ్ కుమార్ అన్నమల్ల సురేష్ పాల్గొని ఇరవై వేల కోట్ల స్మార్ట్ సిటి డబ్బులు ఎటు పోయాయి అని ప్రశ్నించారు. నగరంలో అనేక రోడ్లు అస్తవ్యస్తంగా ఉన్నాయని కోట్లు ఖర్చుపెట్టి నిర్మించ మని చెబుతున్న అధికారులకు, అభివృద్ధి కోసం నిధులు తెచ్చామన్న నాయకులకు ఈ కనిపించడం లేదా" అని ప్రశ్నించారు.

అధికారులు మాత్రం మంచి రోడ్ల నిర్మించా మని అందమైన రోడ్లు అహ్లాదకరమైన వాతావరణం ప్రజలకు కల్పిస్తున్నా మని గొప్పలు చెప్పు కుంటున్న నాయకులు అభివృద్ధి మాత్రం శూన్యమన్నారు.

పట్టణంలో రోడ్లు దుస్థితి ఎలా ఉన్నాయో ఒకసారి రోడ్ల మీదికి వచ్చి చూస్తే అధికారులకు నాయకులకు అర్థమవుతుందన్నారు. నిధులు మింగడమే తప్ప పనులు మాత్రం చేయరని తీవ్రంగా విమర్శించారు. ఇప్పటికైనా నాయకులు అధికారులు స్పందించి ఈ గుంతల రోడ్లను బాగు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## శిలా పలకపై స్టిక్కర్లను తొలగించాలని కమిషనర్‌కు వినతిపత్రం



**వనపర్తి అక్షిత ప్రతినిధి :** మున్సిపల్ ఎలక్షన్ సందర్భంలో ఎలక్షన్ కోడ్ లో భాగంగా పట్టణంలోని అన్ని శిలాఫలకాలకు మున్సిపల్ కార్మికులు స్టిక్కర్లు అంటించడం జరిగింది కానీ ఎలక్షన్ ముగిసి ఐదు నెలలు కావస్తున్నా వాటిని ఇంకా తొలగించలేదని కోరుతూ మున్సిపల్ కమిషనర్ కు బిఆర్ఎస్ పార్టీ కౌన్సిలర్లు, బి ఆర్ ఎస్ పార్టీ యువ విభాగం నాయకులు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ తో మాట్లాడుతూ తక్షణమే శిలా పలకలపై స్టిక్కర్లు తొలగించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే పట్టణంలో కుక్కల బెడద కూడా అదికంగా ఉంది, వాటివల్ల చిన్నపిల్లలకు స్కూల్ కి ఒంటరిగా వెళ్ళడానికి కూడా ఇబ్బందిగా ఉందని వివరించారు. వర్షాకాలం మొరిలకు మురికి నీరు చేరి దోమల బెడద ఎక్కువగా ఉన్నందువల్ల మోరీలు ఎప్పటికప్పుడు తీసి రోజూ శానిటేషన్ చెయాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు నారమన్ అయ్యన్న, తిరుపతయ్య, ముంత మంజుల రామకృష్ణ, సింగిల్ విండో డైరెక్టర్ బాలకృష్ణ రెడ్డి, యువ విభాగం నాయకులు శ్రీనివాస్ జీ, శాంతిరాజ్, వికాస్, మహేష్, రాజ్ కుమార్ చింటూ, రవికుమార్, నాగేశ్వర్ రెడ్డి, ఎండీ. షఫీ, సర్ఫరాజ్, వాజిద్, ఫర్హాన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యతోనే సమాజ ప్రగతి సాధ్యం

### ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉంది

### మహనీయుల ఆశయాలు విద్యార్థులకు స్ఫూర్తి అనిరుధ్ రెడ్డి





**జడ్చర్ల ,అక్షిత న్యూస్:** నవాబ్‌పేట్ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో నూతనంగా ఏర్పాటు చేసిన భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ విద్యావేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహంతో పాటు సావనీర్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో నేడు జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుధ్ రెడ్డి పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు పాఠశాల అభివృద్ధి కమిటీ సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతూ, మహనీయుల జీవితాలు విద్యార్థులకు ఆదర్శప్రాయమని, వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకొని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు.





విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమవుతుందని, ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన విద్యా వాతావరణం కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధితో పాటు నాణ్యమైన విద్య అందించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యా శాఖ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాద ప్రాంతాలలో ప్రజల రాకపోకలను నియంత్రించాలి

### జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య



**అక్షిత బ్యూరో, మంచిర్యాల :** ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలు నేపథ్యంలో ఉదృతంగా ప్రవహిస్తున్న వాగులు, నదులు, కల్వర్టులు ఇతర ప్రమాద ప్రాంతాల వద్దకు ప్రజలు రాకుండా నియంత్రణ చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య అన్నారు. గురువారం జిల్లాలోని జైపూర్ మండలం టేకుమట్ల గ్రామపంచాయతీ పరిధిలోని వాగు ప్రవాహాన్ని, శిథిలావస్థలో ఉన్న మండల ప్రాథమికోన్నత పాఠశాలను అధికారులతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లాలో నెలకొన్న వర్ష పరిస్థితుల దృష్ట్యా ప్రజా సంక్షేమ, రక్షణ చర్యలు పకడ్బందీగా చేపట్టాలని అధికారులకు సూచించారు. వాగు ప్రవాహం ఎక్కువగా ఉన్న సమయంలో ప్రజలు, వాహనదారులు అప్రమత్తంగా ఉండాలని, వాగు ఉధృతి పెరిగిన సందర్భంలో ప్రజలు ఎత్తి పరిస్థితులలోనూ వాగును దాటకుండా అవసరమైన ముందస్తు భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జాగ్రత్త చర్యలలో భాగంగా బారికేడ్లు ఏర్పాటు చేయాలని, వాగు వద్ద ప్రమాదకర పరిస్థితులు ఏర్పడకుండా పంచాయతీ, పోలీస్ సిబ్బంది సమన్వయంతో నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. అత్యవసర పరిస్థితులలో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. గ్రామంలోని మండల ప్రాథమికోన్నత పాఠశాలను సందర్శించి పాఠశాల భవనం ప్రస్తుత స్థితిగతులను క్షేత్రస్థాయిలో పరిశీలించి, విద్యార్థుల భద్రతకు సంబంధించిన అంశాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. శిథిలావస్థలో ఉన్న భవనాల విషయంలో ఎలాంటి ప్రమాదం జరగకుండా తగిన ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, పాఠశాల భవనం పరిస్థితిపై సంబంధిత అధికారులు సమగ్రంగా పరిశీలించి, అవసరమైన చర్యలు చేపట్టాలని తెలిపారు. ప్రజలు అధికారుల సూచనలను పాటిస్తూ అత్యవసరం అయితేనే బయటకు రావాలని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.సత్యనారాయణ, మండల పంచాయతీ అధికారి శ్రీపతి బాపు, సి.ఐ. నవీన్ కుమార్, ఎస్.ఐ. భూమేష్, పంచాయతీ కార్యదర్శి టి.శ్రీనివాస్, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ల అమలు కోసం పోరాడుదాం

### మహిళా రిజర్వేషన్ బిల్లు పట్ల పాలక వర్గాల ద్వంద వైఖరిని ఖండించండి

### పిఓడబ్ల్యు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లగుండ్ల శిరోమణి




**సూర్యాపేట , అక్షిత ప్రతినిధి :** చట్ట సభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ బిల్లుపై పాలక వర్గాల ద్వంద్వ వైఖరిని ఖండిస్తూ,మహిళలకు చట్ట సభల్లో 33 శాతం రిజర్వేషన్ల అమలుకై పోరాడి సాధించు కుందామని ప్రగతిశీల మహిళా సంఘం(పిఓడబ్ల్యూ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చల్లగుండ్ల శిరోమణి పిలుపునిచ్చారు.గురువారం జిల్లా కేంద్రంలోని విక్రం భవన్ లో పిఓడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు మారసాని చంద్రకళ అధ్యక్షతన జిల్లా కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. కేంద్ర,రాష్ట్ర పాలక వర్గాలు అనుసరిస్తున్న ఈ ద్వంద నీతి వల్ల నేటికీ చట్ట సభలలో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అమలు కాకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీతో పాటు మతోన్మాదాన్ని పెంచి పోషించే బిజెపి వరకు అన్ని పాలకవర్గ పార్టీలు కూడా మనువాదాన్ని బలపరుస్తూ,మహిళలను రెండవ శ్రేణి పౌరులుగానే గుర్తిస్తున్నారని ఆందోళన వ్యక్త పరిచారు.కేంద్ర ప్రభుత్వానికి మహిళా సాధికార పట్ల నిజమైన గౌరవం ఉంటే డీలిమిటేషన్ బిల్లుతో సహా ఎలాంటి షరతులు విధించకుండానే పార్లమెంటులో 33 శాతం రిజర్వేషన్ బిల్లుపై ఆమోదం తెలపాలని ఆమె డిమాండ్ చేశారు.మహిళా బిల్లును అడ్డుకునే వారిని సమాజంలో త్వరలోనే ఎండగడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో పిఓడబ్ల్యు జిల్లా ప్రధాన కార్యదర్శి కొత్తపల్లి రేణుక, ఉపాధ్యక్షురాలు సూరం రేణుక,సహాయ కార్యదర్శి ఒంటికొమ్ము సంతోషిమాత, కోశాధికారి మోటకట్ల జయమ్మ, సభ్యులు ఐతరాజు పద్మ,కట్టా కల్పన తదితరులు పాల్గొన్నారు.